- నారుమళ్లు పోసుకున్న అన్నదాతలు
- వెదజల్లే, డ్రమ్‌సీడర్ పద్ధతుల వైపు రైతుల మొగ్గు
- పొలం పనుల్లో బిజీబిజీ

# యాసంగి జోరు


మద్దూరులో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు


నాటుకు సిద్ధంగా ఎదిగిన నారుమడి

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 4: వానకాలంలో పంటలు సమృద్ధిగా పండి ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. అదే ఉత్సాహంతో యాసంగి పనుల్లో నిమగ్నమయ్యారు. నిన్నమొన్నటి వరకు వరికోతలు, పత్తితీత తదితర వ్యవసాయ పనులతో బిజీబిజీగా గడిపిన రైతులు తిరిగి యాసంగి పనులు మొదలుపెట్టారు. ఉమ్మడి మద్దూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇప్పటికే యాసంగి సాగు కోసం రైతులు నారుమడులను సిద్ధం చేసుకుని పొలం దున్నకాల్లో నిమగ్నమయ్యారు. దీంతో గ్రామాల్లో ఎక్కడచూసినా యాసంగి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ట్రాక్టర్లకు ఒక్కసారిగా గిరాకీ పెరిగింది. వరి సాగులో రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులపై దృష్టి సారిస్తున్నారు. చెరువులు, వాగులతోపాటు బోరుబావుల నిండా నీరు ఉండడంతో రైతులు వడివడిగా యాసంగి సాగు పనుల వైపు అడుగులు వేస్తున్నారు.

**పెరగనున్న సాగు విస్తీర్ణం**

గతేడాది యాసంగిలో వరి 18,750 ఎకరాలు, మొక్కజొన్న 750, మినుములు 97, వేరుశెనగ 250, పెసర 72, నువ్వులు 196, జొన్నలు 49, శనగలు 50, ఇతర పంటలు 100 ఎకరాల్లో సాగయ్యాయి. ఈ ఏడాది యాసంగిలో వరి 20,530, మొక్కజొన్న 810, వేరుశెనగ 350, పెసర 54, శనగ 70, నువ్వులు 212, జొన్నలు 54, ఇతర పంటలు 150 ఎకరాల్లో సాగు కానున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రైతులు వరి పంటపైనే అధికంగా ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం వరికి బదులుగా ఇతర పంటలు వేసుకొని అధిక దిగుబడులు సాధించవచ్చునని సూచిస్తున్నారు.

**కూలీల కొరతను అధిగమించేందుకు..**

వరి సాగులో రోజురోజుకూ పెరుగుతున్న కూలీల కొరతను అధిగమించేందుకు రైతులు వెదజల్లే పద్ధతితోపాటు డ్రమ్‌సీడర్ సహాయంతో నాట్లు వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఒకేసారి వరి నాట్లు వస్తుండడంతో రైతులకు కూలీల సమస్య తీవ్రమవుతున్నది. మూడేండ్లుగా ఈ పద్ధతుల్లో వరి సాగు చేసిన రైతులు అధిక దిగుబడులు సాధించారు. దీనికి తోడు కొంతమంది రైతులు వరి నాటు యంత్రాలతో నాట్లు వేస్తుండగా, మరికొంతమంది రైతులు ఇతర రాష్ర్టాల నుంచి కూలీలను తెప్పించి నాట్లు వేయిస్తున్నారు. ఈ ప్రత్యామ్నాయ సాగు విధానం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి అధిక లాభాలు పొందే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

## 'శిశుగృహ'లో మొదటి దత్తత


ఆడ శిశువును దత్తత ఇస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేట కమాన్, జనవరి 4: పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకునేందుకు సిద్దిపేటలోని శిశు గృహ/జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, దీంతో ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ తెలిపారు. గురువారం సిద్దిపేట కలెక్టరేట్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాలో శిశు గృహ ఏర్పడిన తర్వాత మొదటి దత్తతగా ఆడ శిశువును నల్లగొండ జిల్లాకు చెందిన దంపతులకు, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ చేతుల మీదుగా అధికారికంగా దత్తత ఇచ్చారు. అలాగే గజ్వేల్‌కు చెందిన ఒకే కుటుంబంలోని అన్నాదమ్ములకు రిలేటివ్ అడాప్షన్ ద్వారా అధికారిక దత్తతను ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్ రెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, బాలరక్షభవన్ కోఆర్డినేటర్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి, శిశుగృహ మేనేజర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరి నేత్రదానం


అంజయ్య(ఫైల్)


చెన్న రాజయ్య(ఫైల్)

గజ్వేల్, జనవరి 4: సర్వేంద్రియాణం నయనం ప్రధానం అంటారు. అంతటి ప్రధానమైన కండ్లను మరణించిన తర్వాత మట్టిపాలు చేసేకంటే దానం చేయడం ఉత్తమంగా భావించి నేత్రాలను దానం చేశారు. గజ్వేల్ మండలం దిలాల్‌పూర్ గ్రామానికి చెందిన పాశకంటి అంజయ్య(78) రిటైర్డు ఉద్యోగి. కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం అకస్మాత్తుగా మృతి చెందాడు. మృతుడి కుమారుడు నర్సింలు ప్రభుత్వ జిల్లా దవాఖానలో ఫార్మాసిస్టుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. నేత్రాల ప్రాధాన్యం తెలిసిన వ్యక్తి కావడంతో తన తండ్రి నేత్రాలను లయన్స్ క్లబ్ ద్వారా దానం చేశారు. అయితే అంజయ్య దహన సంస్కారాలు శుక్రవారం స్వగ్రామంలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. గజ్వేల్ మండలం కొల్గూర్ గ్రామానికి చెందిన చెన్న రాజయ్య(75) కొన్నేండ్ల క్రితం వృత్తిరీత్యా గజ్వేల్‌కు వచ్చి స్థిరపడ్డాడు. రాజయ్య గురువారం మృతిచెందడంతో అతడి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేస్తామని చెప్పడంతో లయన్స్ క్లబ్ సహకారంతో వాసన్ ఐకేర్ హైదరాబాద్ వారికి అందజేశారు. గురువారం గజ్వేల్‌లో ఆయన అంత్యక్రియలు ముగిశాయి.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట, జనవరి 4: సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాస్ అన్నారు. దుబ్బాక పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి నుంచి దుబాయ్ వెళ్లడానికి వీసా, అన్ని పర్మిషన్లు తామే తెస్తామని మెసేజ్ పంపడంతో నమ్మిన బాధితుడు వెంటనే ఫోన్ ద్వారా బ్యాంకు వివరాలు పంపించాడన్నారు. రెండుమూడు విడతలుగా ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా రూ.2,79,900 పంపించినట్లు చెప్పారు. తర్వాత ఆ ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో అనుమానం వచ్చిన బాధితుడు వెంటనే సైబర్ సెల్ జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కాల్ చేసి ఫిర్యాదు చేశాడని, స్పందించి వెంటనే రూ.1,75,000 ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు.

## 18, 19 తేదీల్లో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 4: రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ ఆదేశాల మేరకు జనవరి 18, 19 తేదీల్లో జిల్లాస్థాయి వైజ్ఞానిక గణిత, పర్యావరణ ప్రదర్శనలను ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు మెదక్ జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ ఓ ప్రకటనలో తెలిపారు. సమాజం కోసం సైన్స్, సాంకేతికత, ఆరోగ్యం, పర్యావరణ అనుకూల జీవనశైలి, వ్యవసాయం, కమ్యూనికేషన్, రవాణా, కంప్యూటేషనల్ థింకింగ్ అంశాల్లో విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్స్, మోడళ్లను ఈనెల 10వ తేదీలోగా https://formx.gle/9ENdUHVbeaGfyqS6 వెబ్‌సైట్‌లో పంపాలని సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డిని(8328599157) సంప్రదించలన్నారు.

## అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ మృతి

నర్సాపూర్, జనవరి 4: అనుమానాస్పద స్థితిలో ఆటోడ్రైవర్ మృతి చెందిన ఘటన నర్సాపూర్ మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై శివకుమార్ కథనం ప్రకారం.. నర్సాపూర్ పట్టణానికి చెందిన రామె నర్సింహులు(40) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగానే బుధవారం ఉదయం ఆటోతో వెళ్లిన నర్సింహులు సాయంత్రం 6 గంటలకు నర్సాపూర్ మండలం లింగాపూర్ శివారులో స్పృహ కోల్పోయి నోటివెంట నురగలతో ఆటోలో పడి ఉండడంతో అదేగ్రామానికి చెందిన ఉప్పలపు ప్రసాద్, తలారి మల్లేశ్ ఆటోలో ఇంటికి తీసుకువచ్చారు. కుటుంబ సభ్యులు వెంటనే నర్సాపూర్ ఏరియా దావాఖానకు తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యుడు అప్పటికే చనిపోయాడని తెలిపారు. తన భర్త మృతిపై అనుమానం ఉన్నదని మృతుడి భార్య లక్ష్మి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

## స్కేటింగ్‌లో ఎంపిక పోటీలు

సంగారెడ్డి అర్బన్, జనవరి 4: ఉమ్మడి మెదక్ జిల్లా అండర్ 11, అండర్ 14 స్కేటింగ్ బాలుర విభాగంలో ఎంపిక పోటీలను రామచంద్రపురం బీహెచ్‌ఈఎల్ స్టేడియంలో బుధవారం నిర్వహించారు. సుమ రు 50 మంది క్రీడాకారులు పాల్గొనగా 12 మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వారిని పలువురు అభినందించారు.

## యూనియన్ ఎన్నికల్లో బీఆర్టీయూ విజయం


విజయోత్సవాల్లో బీఆర్టీయూ అభ్యర్థి రవీందర్‌రెడ్డి

సిద్దిపేట, జనవరి 4: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి ఆర్చ్ ఫార్మా కంపెనీలో జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అనుబంధ కార్మికసంఘం బీఆర్టీయూ నుంచి పోటీ చేసిన మారెడ్డి రవీందర్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి బీఎంఎస్‌పై విజయం సాధించారు. గురువారం సాయంత్రం ప్రకటించిన ఫలితాల్లో బీఆర్టీయూ విజయం సాధించడంతో ఆర్చ్ ఫార్మా కంపెనీ వద్ద కార్మికులు పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సలహాదారు రమేశ్, ప్రధాన కార్యదర్శి దారం కిషన్, కోశాధికారి చింత శ్రీనివాస్, సీనియార్ నాయకులు లింగారెడ్డి, మంచే నర్సింహులు, పిండి అరవింద్, కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

## 'ప్రజాపాలన'ను పరిశీలించిన అదనపు కలెక్టర్


దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేట, జనవరి 4 : ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. గురువారం పట్టణంలోని 43 వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ ఉన్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి**

బెజ్జంకి, జనవరి 4 : ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారయణ సూచించారు. గురువారం మండలంలోని గుండారంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని సర్పంచ్ లావణ్యతో కలిసి ప్రారంభించారు.

## గ్రంథాలయానికి గిన్నిస్ బుక్ అందజేత



గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌ను గ్రంథాలయ అధికారికి అందజేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ

హుస్నాబాద్ టౌన్, జనవరి 4 : అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌ను హుస్నాబాద్ గ్రంథాలయానికి హుస్నాబాద్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ గిన్నిస్ బుక్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ ఈ పుస్తకం స్ఫూర్తినిస్తుందన్నారు. గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ అలయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ దూడం నాగభూషణం, అధ్యక్షుడు గాజుల భగవాన్, కార్యదర్శి వెల్దండి లక్ష్మీపతి, గ్రంథాలయ ఇన్‌చార్జి ఎనుముల ఉమాపతి, ప్రతినిధులు చందుల వీరసోమయ్య, బొడ్డు తిరుపతి, లోక్‌ఆదాలత్ సభ్యుడు చిత్తారి రవీందర్, న్యాయవాదులు కొత్తపల్లి దేవేందర్, సుంకె రాజశేఖర్ పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికీ ప్రభుత్వ ఫలాలు

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

మెదక్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు కోరారు. హవేళీఘనపూర్ మండలం బూర్గుపల్లి, గాజిరెడ్డిపల్లి గ్రామాల్లో గురువారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషాతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో వచ్చిన ప్రతి దరఖాస్తును అధికారులు స్వీకరించాలన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మెదక్ కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం దరఖాస్తులను స్వీకరించడానికి అధికార యంత్రాంగం ప్రజల మధ్యకే వచ్చిందన్నారు. ఆరు గ్యారెంటీల్లో రెండు గ్యారెంటీలను ఇప్పటికే అమలు అవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా మైనింగ్, జియాలజీ శాఖ సహాయ సంచాలకుడు జయరాజ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయలక్ష్మి, ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ నారాయణ, సర్పంచ్‌లు చిన్నాగౌడ్, సాయిబాబా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్